క్లుప్తంగా

ఏఎన్ఎంలను నియమించాలి

పార్వతీపురం టౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘ నాయకుడు పాలక రంజిత్‌కుమార్ కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, వసతిగృహాల్లో మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

వసతిగృహాల్లో ఫేషియల్ హాజరు


విద్యార్థుల హాజరు వేస్తున్న వార్డెన్

పార్వతీపురం: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహంలో శనివారం ఫేషియల్ హాజరు చేశారు. వసతిగృహాల్లో వాస్తవిక హాజరు నమోదు చేసేందుకు ప్రభుత్వం విద్యార్థుల ఫేషియల్ హాజరును అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానం అన్ని వసతిగృహాల్లో అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి ప్రీ మెట్రిక్ వసతి గృహంలో కూడా ఫేషియల్ హాజరు చేశారు.

బాల్య వివాహాలతో అనర్థాలు..


మాట్లాడుతున్న బాలల సంరక్షణ అధికారి ఎంప నాయుడు

పార్వతీపురం టౌన్: బాల్య వివాహాలు సాంఘిక దురాచారాలుగా మారాయని బాలల సంరక్షణ అధికారి ఎంప నాయుడు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని గిరిజన సంక్షేమ వసతిగృహంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్, చైల్డ్ బెగ్గింగ్‌పై వివరించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం ..


గేదెల రామకృష్ణను అభినందిస్తున్న నాయకులు

సాలూరు: కాంగ్రెస్ పార్టీ సాలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా గేదెల రామకృష్ణ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం వెలువడ్డాయి. ఈ మేరకు పట్టణంలోని సీతారామ కల్యాణ మండపంలో రామకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిగడాపు బంగారయ్య, పుండరీకాక్ష నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో సంతాప ర్యాలీ


మక్కువలో సంతాప ర్యాలీ

మక్కువ: రెండు రోజుల కిందట రహదారి ప్రమాదంలో మృతి చెందిన లెంకాన సాయికుమార్ అవయవాలను అతని తల్లిదండ్రులు దానం చేసిన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు, యువత అమర్ రహే సాయికుమార్ అంటూ నినాదాలు చేస్తూ శనివారం మండల కేంద్రంలో సంతాప ర్యాలీ నిర్వహించారు. సంతాప ర్యాలీలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు మావుడి ప్రసాదనాయుడు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రజక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవికుమార్

భామిని: అవిభక్త శ్రీకాకుళం జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శిగా భామినికి చెందిన పోతల రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల శాఖ శనివారం ప్రకటించింది. జిల్లా కోశాధికారిగా పనిచేస్తున్న పోతల రవికుమార్ సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారున. జిల్లా అధ్యక్షుడిగా నౌపాడ రామారావుతో పాటు నూతన కార్యవర్గానికి రజక సంఘ నాయకులు అభినందనలు తెలియజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

- ఎస్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు

పార్వతీపురం టౌన్:

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని ఎస్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు అన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత ఎలక్ట్రానిక్ ప్రపంచంలో ఏకాగ్రత, విజ్ఞానం కోసం పుస్తకపఠనం ఎంతో అవసరమన్నారు. కాలేజీ లైబ్రరీలో ఉన్న వివిధ రకాల టెక్స్ట్ బుక్స్ , పోటీపరీక్షల పుస్తకాలు, డిక్షనరీస్, కథలు, నవలలతో పాటుగా ఈ-రిసోర్సెస్‌ను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, లైబ్రేరియన్ గణేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి..


మాట్లాడుతున్న జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి రమేష్

పార్వతీపురం టౌన్: విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఎల్. రమేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయన్నారు. పుస్తకం చదవడం ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. పుస్తక పఠనంతో వ్యక్తిగత వికాసంతో పాటు విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. గ్రంథాలయాల్లో ఉన్న సాహిత్యం, మహానుభావుల జీవిత చరిత్రలు, ఇతర పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ.. పుస్తకం మంచి స్నేహితుడితో సమానమన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు, పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ముప్పు


పట్టణ మహాసభలలో పాల్గొన్న సీపీఎం నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

పార్వతీపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న జమిలి ఎన్నికలను తిరస్కరించాలని, ఈ విధానం వల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం పార్వతీపురం పట్టణ ఆరో మహాసభ నిర్వహించారు. మొదటగా మహాసభ ప్రారంభ సూచికగా సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధుల సభలో ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో మరణించిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, రాష్ట్ర నాయకులు ఎం.సత్యనారాయణ, ఇతర ప్రమాదాలలో మరణించిన అమరులకు సంతాపం ప్రకటించారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ.. జమిలి ఎన్నికల వల్ల ప్రజలు ప్రశ్నించే హక్కుని కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక వల్ల డబ్బులు ఉన్నవాళ్లే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి ఉంటుందని, రాష్ట్రాలు తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దేశంలో రోజురోజుకూ నిరుద్యోగం పెరిగిపోతోందని.. ప్రజా సమస్యలు పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలను మాత్రం కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 'అనంతరం పార్టీ నాయకుడు వై.మన్మధరావు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తగిన మెజారిటీ ఇవ్వలేదని.. ఎన్‌డీఏ పక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడినా గత ఆర్థిక విధానాలనే దూకుడుగా అమలు చేయడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం సనాతన ధర్మం పేరుతో హిందుత్వ అజెండాను ప్రజలపై రుద్దుతోందని ఆరోపించారు.

పట్టణ నూతన కమిటీ ఎన్నిక

పట్టణ నూతన కమిటీ సభ్యులుగా ఎనిమిది మందిని మహాసభ ప్రతినిధులు ఎన్నుకున్నారు. పాకల సన్యాసిరావు, రెడ్డి శ్రీదేవి, ఎస్.ఉమా, పి.రాజశేఖర్, కె.భగత్, బి.లక్ష్మి, ఎం.వెంకటరమణ, బి.సూరిబాబుతో పాటు నూతన పట్టణ కమిటీ కార్యదర్శిగా జి. వెంకటరమణను ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, రోడ్లు, కాలువలు, శ్మశానవాటిక, విద్యుత్ కోతలు, తదితర సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి ఉందన్నారు. డిసెంబర్ 10, 11 తేదీలలో కురుపాంలో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికలతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

- ఎంపీపీ బడ్నాన ప్రమీల

పాచిపెంట: ముందస్తు ప్రణాళికలతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, నిధుల వినియోగంపై సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా సర్పంచ్‌లు నిధులు ఖర్చు చేయాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూర్చుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీడీఓ బీవీజే పాత్రో, వైస్ ఎంపీపీలు మీసాల నారాయణ, కురుపల్లి రవీంద్ర, ఈపీఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

పాచిపెంట: రెండు నెలలుగా తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కేసలి పంచాయతీ కుమ్మరివలస మహిళలు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకుడు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో గ్రామంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, మంచినీటి పథకానికి సంబంధించిన మోటార్ పాడైందని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమీపంలో ఉన్న గెడ్డ వాగు నుంచి నీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. అయితే కలుషిత నీరు కావడంతో రోగాలు ప్రబలుతున్నాయని, అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

రైతు సదస్సులను వినియోగించుకోవాలి

- తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

సీతానగరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని పణుకుపేటలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భూ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మ్యుటేషన్స్, వంశపారంపర్యగా వస్తున్న భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బి. పద్మావతి, మాజీ సర్పంచ్‌లు, రైతులు ఆర్‌వీ పార్థసారధి, జోగినాయుడు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికల తయారీపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మజ్జి శోభారాణి, తదితరులు

పార్వతీపురం టౌన్: గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రమేష్ ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికల తయారీపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేయడానికి అవసరమైన పద్ధతులు, అనుసరించాల్సిన విధానాలపై వివరించారు. పంచాయతీలకు వచ్చే నిధులను బట్టి ప్రాధాన్యతాక్రమంలో సర్పంచ్‌లు, అధికారాలు, ప్రజల సమన్వయంతో పనులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించండి

పాలకొండ రూరల్: పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం సిబ్బందితో కలిసి పలు వ్యాపార సంస్థలు, దుకాణాలను పరిశీలించారు. ప్లాస్టిక్ సంచులు వాడొద్దని సూచించారు. కిరాణా షాపులు, హోటళ్లు, ప్రధాన మార్కెట్‌లో తనిఖీలు చేపట్టారు. పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని అధిగమించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలో పలువురిపై అపరాధ రుసుం విధించారు.

ప్రణాళికల ఆధారంగా అభివృద్ధి పనులు

- ఎంపీపీ రవణమ్మ, ఎంపీడీఓ త్రివిక్రమరావు


మాట్లాడుతున్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు

సీతానగరం: మండలంలోని పంచాయతీ పాలకులు రూపొందించిన ప్రణాళికల ఆధారంగానే ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఎంపీపీ బి. రవణమ్మ, ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న జీపీడీపీ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికల తయారీ కోసం పంచాయతీ కార్యదర్శులు, డీఏలకు రెండు రోజులు.. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం, తాగునీరు, చెత్త నుంచి సంపద తయారీ, విద్యుదీకరణ పనులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. అలాగే సీజనల్ జ్వరాలను అదుపు చేసేందుకు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అనంతరం రామవరం, జానుమల్లువలస సర్పంచ్‌లు పి. సత్యంనాయుడు, వై. వెంకటనాయుడు మాట్లాడుతూ.. శిక్షణ తరగతులు నిర్వహించడం వల్ల చేపట్టాల్సిన పనులపై అవగాహన ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, కోర్స్ డైరెక్టర్లు మనోహర్, పీటర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీఆర్‌పేటను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతాం..


గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: మండలంలోని వీఆర్‌పేటను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకటరాయుడుపేట (వీఆర్ పేట) గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. జట్టు స్వచ్ఛంద సంస్థ గ్రామంలో గోశాల ఏర్పాటు చేసి, తద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామంలోని పరిస్థితులు, తదితర అంశాలను సంబంధిత ప్రతినిధులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. గ్రామ పంచాయతీలో గల పశు సంపదను ఉపయోగించుకుని పాలు, పాల ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న గోశాలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో అనేక కార్యకలాపాలు చేపట్టుటకు అవకాశాలు ఉన్నాయని, ప్రజలు కొంత మేరకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తే మంచి ఫలితాలు సాధించగలమన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా వెంకటరాయుడు పేటలో ఆహ్లాదకర వాతావరణం నెలకొనాలని ఆకాంక్షించారు. పశు సంపదను అభివృద్ధి చేసుకోవడంతో పాటు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర సలహాదారు సి. శ్రీనివాసన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి జయకిరణ్, జట్టు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తే చర్యలు


బలిజిపేట: సారా క్రయ, విక్రయాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- ఎక్సైజ్ సీఐ పద్మావతి

బలిజిపేట: సారా తయారుచేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి అన్నారు. మండలంలోని సుభద్ర గ్రామంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సారా తయారీపై ఎటువంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలన్నారు. సారా రవాణా, అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామం వద్ద రూట్ వాచ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీకే విక్రయించాలని, ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే 94409 02373 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఎక్సైజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తప్పవు..

సీతానగరం: సారా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ డి. పద్మావతి అన్నారు. బలిజిపేట, సీతానగరం, గరుగుబిల్లి మండలాల ప్రధాన రహదారి కూడలైన పి. చాకరాపల్లి, పెదంకలాం జంక్షన్లతో పాటు పార్వతీపురం – సీతానగరం రహదారిలో మరిపివలస వద్ద శనివారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. సారా, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఐ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలోఎ స్సైలు సిబ్బంది పాల్గొన్నారు.


పార్వతీపురం టౌన్: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్సై నాగేశ్వరరావు

సారా రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం..

పార్వతీపురం టౌన్: సారా రహిత పట్టణంగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దుదామని ఎక్సైజ్ ఎస్సై నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పెదరెల్లివీధిలో సారా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జీసీసీ ఎన్నికలకు 9 నామినేషన్లు

సీతంపేట: గిరిజన సహకార సంఘం సభ్యుల ఎన్నికకు సంబంధించి శనివారం 9 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల అధికారి జి.విజయ్‌కుమార్ తెలిపారు. కూరంగి రామారావు, బిడ్డిక కృష్ణారావు, పి.ఆదినారాయణ, ఎం.ఎండయ్య, ఎం.రత్నాలమ్మ, వి.సింహాద్రి, పి.శ్రీనివాసరావు, పిరబక శ్రీనివాసరావు, కె.బలరాంలు నామినేషన్‌లు వేశారు. ఎన్నిక ఈనెల 25న జరగనుందన్నారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ, డీఎల్ సీవో వై.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న నలుగురి అరెస్ట్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం మూలిగూడ వద్ద సారా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి.నారాయణరావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మూలిగూడ జంక్షన్ వద్ద కాపుకాయగా కొండుకుప్ప ప్రాంతం నుంచి కురుపాంకు చెందిన రాయిపిల్లి అప్పారావు, బొమ్మాళి శివ, రాయిపల్లి సురేష్, సుండి ఆనంద్ ద్విచక్ర వాహనాలపై సారా క్యాన్లు, ప్యాకెట్లు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. సుమారు 70 లీటర్ల సారాతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


నిందితులతో ఎస్సై పి.నారాయణరావు, పోలీసులు